సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 10 । ఆగస్టు । 2025



ఉపాధి మెండుగ..

జిల్లాలో శ్రావణ బోనాల సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో అనుబంధ వ్యాపారాలు కూడా జోరందుకున్నాయి.

- 8లో



ఇద్దరి అరెస్ట్

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగారం పోలీసులు అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**589.70** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**44,647** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**44,647** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**29,070** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**6,041** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**7,436** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**1,800** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో సోలార్ విద్యుత్ వాడుతున్నాం



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనం (కలెక్టరేట్ సముదాయం)కు సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు సూర్యాపేట నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023లోనే సూర్యాపేట ఐడీఓసీ రూఫ్ టాప్‌పై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేశామని వివరించారు. దీని ద్వారా రోజూ 372 కిలోవాట్ల విద్యుత్ జనరేట్ అవుతుందన్నారు. ఈ విద్యుత్‌ను కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగిస్తున్నామని వెల్లడించారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి శంకర్

సూర్యాపేట : ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ మూఢ నమ్మకాలను విడనాడి ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శంకర్ అన్నారు. ఆదివాసీ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేటలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంత్ సేవాలాల్ సూచించిన నియమాలను ఆచరిస్తూ ఆదివాసీలు, గిరిజనులు ముందుకు సాగాలన్నారు. ఆదివాసీలకు ప్రభుత్వాలు కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ వసతి గృహం అధికారులు సాయి రాములు, లింగయ్య, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో బంగారు పతకాలు



పతకాలు అందుకుంటున్న నాగేశ్వర్‌రావు

సూర్యాపేట : ఆదిలాబాద్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి 6వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్-2025లో సీనియర్-బి విభాగంలో సూర్యాపేటకు చెందిన గూడూరు నాగేశ్వర్‌రావు నాలుగు ఈవెంట్లలో పాల్గొని నాలుగింటిలో కూడా ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించినట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి శనివారం తెలిపారు. అలాగే సీనియర్-ఎ విభాగంలో దేశగాని ఉప్పలయ్య నాలుగు ఈవెంట్లలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కోదాడకు చెందిన కీత శ్రీనివాసరావు సీనియర్-ఎ విభాగంలో ఒక ఈవెంట్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలు, ప్రతిష్టా అలంకార మూర్తులకు అభిషేకం, సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు చేశారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయంలో ఊరేగించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

• అనురాగ బంధన్




రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం సూర్యాపేట పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో రాఖీ కట్టి శుభాకాంక్షలు చెబుతున్న మహిళలు



సూర్యాపేటలోని బాలసదన్‌లో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు రాఖీలు కడుతున్న చిన్నారులు

హద్దుమీరితే జైలుకే..

- పాతనేరస్తులు, రౌడీషీటర్లపై పోలీసుల ప్రత్యేక నిఘా
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- ఈ ఏడాది ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు



సూర్యాపేటటౌన్ : తరచూ నేరాలకు పాల్పడడం.. జైలుకు వెళ్లడం బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ నేరపూరితంగా వ్యవహరించడం నేరస్తులకు పరిపాటిగా మారింది. అలాంటి వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి విక్రయించడం, హత్యలు, గూండాయిజం, దొంగతనాలు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం తదితర వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నారు. పాత నేరస్తులు నేర ప్రవర్తన మార్చుకోకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి వారి కదకలిలను గమనిస్తున్నారు.

గతేడాది ముగ్గురు..

ఈ ఏడాది ఇద్దరిపై పీడీ యాక్ట్

జిల్లా వ్యాప్తంగా 443 మంది రౌడీషీటర్లు ఉన్నట్టు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి. అయితే ఈ ఏడాది గంజాయి, గుట్కాలు విక్రయించేవారు, అక్రమ వ్యాపారాలు, తరచూ నేరాలకు పాల్పడే 1,260 మందిపై సస్పెక్ట్ కేసులు నమోదు చేశారు. అలాగే నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. గత ఏడాది కూడా ముగ్గురిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేశారు.

పోలీస్ రికార్డుల ప్రకారం..	
రౌడీషీటర్ల సంఖ్య	443
సస్పెక్ట్ కేసులు	1,260
పీడీ యాక్ట్ నమోదు	02

పీడీ యాక్ట్ నమోదు ఇలా..

భారత రాజ్యాంగంలో పీడీ యాక్ట్‌ను ప్రివెన్షన్ ఆఫ్ ఆఫ్ డిటెక్షన్ అని అంటారు. 1950లో పీడీ యాక్ట్ అమలులోకి వచ్చింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, నిత్యం నేరాలకు పాల్పడుతూ, శాంతిభద్రతకు విఘాతం కలిగించే నేరస్థులను గుర్తించి వారిపై ప్రయోగించేదే పీడీ యాక్ట్. హత్యలు, దొంగతనాలు, రౌడీలు, పీడీఎస్ బియ్యం రవాణా, నకిలీ విత్తనాలు విక్రయం తదితర వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తారు. తరచూ నేరాలకు పాల్పడుతూ జైలుకి వెళ్లి తిరిగి వచ్చినా వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తారు. పీడీ యాక్ట్ ప్రయోగిస్తే ఏడాదిపాటు జైలు జీవితం గడపాల్సి ఉంటుంది. అప్పటి దాకా బెయిల్ రాదు.

రౌడీషీటర్స్‌పై నిఘా ఉంచాం

అసాంఘిక కార్యకలాపాలతోపాటు నేరాలు, అక్రమ రవాణాకు పాల్పడుతున్న, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై జిల్లా పోలీస్ శాఖ కఠినంగా చర్యలు తీసుకుంటుంది. ఇలాంటి వారిపై సస్పెక్ట్ షీట్స్, హిస్టరీ షీట్స్, రౌడీషీట్స్ నమోదు చేసి మళ్లీ నేరాలకు పాల్పడకుండా వీరిపై నిఘా ఉంచుతున్నాం. సమస్యలకు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను పూచీకత్తుపై బైండోవర్ చేస్తున్నాం. పౌరులు ప్రతిఒక్కరూ సత్ప్రవర్తన కలిగి చట్టానికి లోబడి నడుచుకోవాలి. పోలీసు ప్రజా భరోసా ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ చట్టాలు, సత్ప్రవర్తనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె.నరసింహ, ఎస్పీ, సూర్యాపేట

కోదాడకే నవోదయం

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేఆర్ఆర్ కళాశాల స్థలంలో ఏర్పాటు
- 19.12 ఎకరాల భూమి కేటాయింపు
- భవన నిర్మాణాలకు రూ.50 కోట్లు మంజూరు



కోదాడ: కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరైంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట జిల్లాకు మంజూరు చేసిన నవోదయ విద్యాలయాన్ని కోదాడలో ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. అయితే కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వద్ద ఉన్న కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. డిగ్రీ కళాశాలకు దాదాపు 50 ఎకరాల స్థలం ఉండగా దానిలో 25 ఎకరాల స్థలం వృథాగా ఉంది. దీనిలో 19.12 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం నవోదయ విద్యాలయానికి కేటాయించారు.

త్వరలోనే టెండర్ల ప్రక్రియ


కోదాడలో ఏర్పాటు చేయబోయే నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 12 వతరగతి వరకు సీబీఎస్ఈ విధానంలో బోధన జరుగుతుంది. ఈ విద్యాసంవత్సరం (2025-26)లోనే సూర్యాపేటలో దీన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విషయం విదితమే. కేఆర్ఆర్ కళాశాల వద్ద ప్రభుత్వం కేటాయించిన ఈ స్థలంలో విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసింది. త్వరలోనే నవోదయ విద్యాలయ సమితి టెండర్లను పిలిచి భవన నిర్మాణ పనులను చేపట్టనుంది. రెండేళ్లలోపే పూర్తి భవనాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది. భవన నిర్మాణాలు పూర్తికాగానే ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నడుస్తున్న ఈ విద్యాలయాన్ని కోదాడకు మార్చనున్నారు. ఈ నవోదయ విద్యాలయానికి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేయడం పట్ల కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

కోదాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేయించాను. దీని అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలను అందిస్తాం. రానున్న రెండేళ్లలో కోదాడలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చూస్తా.

– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పూర్తిస్థాయి నీటిమట్టానికి సాగర్



నిండుకుండలా సాగర్ జలాశయం

- మరోసారి తెరుచుకోనున్న గేట్లు

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. నాగార్జునసాగర్ గరిష్టస్థాయి నీటి మట్టం 590.00 అడుగులు (312 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 589.70 అడుగులు (311.1486 టీఎంసీలు)గా ఉంది. ఎగువన గల శ్రీశైలం జలాశయం నుంచి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 65,780 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి 65,530 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం నుంచి విద్యుదుత్పాదన ద్వారా కృష్ణా నదిలోకి 29,313 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, వరద, ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా మరో 15,577 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతుండడం.. ప్రాజెక్టు గరిష్టస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో ఆదివారం ఉదయం క్రస్ట్‌గేట్లను ఎత్తేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఆదివాసీల హక్కులు కాపాడాలి



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

హుజూర్‌నగర్ : మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను అణచివేతకు గురిచేయడం తగదని, ఆదివాసీల హక్కులను కాపాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సందపను బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు మధ్య భారతదేశంలో ఆదివాసీలపై కేంద్రం దాడులు చేయిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య, నాయకులు ఎస్‌డీ.హుస్సేన్, ఎస్‌కే.రజాక్, కృష్ణన్న, వి.సైదులు, సీహెచ్.లక్ష్మి, రేష్మ, శ్యామల, నాగేంద్ర, సత్తమ్మ, మాలాంబి, నరసమ్మ, ఫాతిమా, రంగయ్య వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో రాజకీయ జోక్యం తగదు

మఠంపల్లి: ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో రాజకీయ జోక్యం తగదని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మఠంపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాల కన్నా రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని భావించాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ ఇచ్చిన నివేదికలోని నిజనిజాలను అఖిల పక్షానికి వివరించాలన్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎటూ తేల్చకుండా ఇరు రాష్ట్రాల మధ్య తగవు పెట్టేలా వ్యవహరించడం సరైందికాదన్నారు. నాగార్జున సాగర్ ఎడమకాల్వ పరిధిలోని లిఫ్టులను పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. రైతులకు యూరియా కొరతలేకుండా చూడాలలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వట్టెపు సైదులు, పల్లె వెంకటరెడ్డి, పాండునాయక్, బాలునాయక్, హుస్సేన్, శీలం శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

రాఖీలు కట్టించి.. హెల్మెట్లు అందజేసి



ద్విచక్ర వాహనదారుడికి రాఖీ కట్టి హెల్మెట్ అందజేస్తున్న చిన్నారి

నేరేడుచర్ల : రాఖీ వేడుకలను పురస్కరించుకుని శనివారం నేరేడుచర్ల పట్టణంలో బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులతో ద్విచక్ర వాహనదారులకు రాఖీలు కట్టించి ఐదుగురికి హెల్మెట్లను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాల్లో వేలాది మంది మరణిస్తున్నారని, రోడ్డు భద్రత నియమాలను పాటించేలా చేసేందుకే రాఖీ పండుగ సందర్భంగా హెల్మెట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు జిలకర రామస్వామి, రాంసైదులు, పిచ్చిరెడ్డి, ఇంతియాజ్, చిలకరాజు శ్రీను, పాగుల్ మీరా, జింకల భాస్కర్, తక్కెళ్ల నాగార్జున, సుబ్బారెడ్డి, ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమానికి మద్దతు ప్రకటించాలి




సమావేశంలో మాట్లాడుతున్న గౌరీశంకర్

కోదాడరూరల్ : బీసీ సామాజిక ఉద్యమానికి అన్ని వర్గాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. శనివారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో ఆలోచనపరుల వేదిక ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ జయంతి సందర్భంగా బీసీల కోసం శివవంకర్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి కేంద్ర మంత్రిగా శివశంకర్ ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో పి.నాగేశ్వరరావు, రాయపుడి చిన్ని, రామకృష్ణ, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, రామారావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మూసీకి వరద ఉధృతి

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం సాయంత్రం వరకు ఎగువ నుంచి 5,082 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్ట్‌గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 9,598 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా.. నీటిమట్టాన్ని 643.50 వద్ద నిలకడగా ఉంచి ఎగువ నుంచి వస్తున్న వరద మొత్తం దిగువకు వదులుతున్నారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 286 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.0 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.



మూసీ ఐదు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

పని ప్రదేశంలో ఆమెకు రక్షణ

- పది మందికి మించి ఉద్యోగులు పనిచేసే చోట అంతర్గత కమిటీ
- లైంగిక వేధింపులకు గురైతే కమిటీకి ఫిర్యాదు చేసే వెసులుబాటు
- ఇప్పటి వరకు జిల్లాలో 20 కమిటీలు ఏర్పాటు



సూర్యాపేటలో అంతర్గత కమిటీల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

నాగారం : సమాజం ఎంత అభివృద్ధి చెందుతున్నా మహిళలు, యువతులకు నానాటికీ రక్షణ లేకుండా పోతోంది. వారు పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురికావాల్సి వస్తోంది. ఎవరికీ చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోవాల్సిన పరిస్థితి. వీటికి అడ్డుకట్ట వేసి, వారికి రక్షణ కల్పించడం కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. వారికి అండగా నిలుస్తున్నాయి. ఇందులో భాగంగా పని ప్రదేశంలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేస్తున్నాయి.

లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం..

లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013ను అనుసరించి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్ తదితర ప్రదేశాలతోపాటు ఉపాధి హామీ పని ప్రాంతాలు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ కేంద్రాల్లో మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగా స్త్రీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత బృందం అంతర్గత కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకు 20 కమిటీలు వేశారు. మరికొన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఎక్కడెక్కడంటే..

సంఘటిత రంగంలోని కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల్లో పది మందికి మించి ఉద్యోగులు (పురుషులు, మహిళలు కలిపి) ఉంటే అక్కడ కమిటీలు ఏర్పాటు చేస్తారు. అక్కడ ఉద్యోగినులు ఎవరైనా వేధింపులకు గురైతే ఈ కమిటీలకు ఫిర్యాదు చేయవచ్చు. పది మంది కంటే తక్కువ ఉన్న కార్యాలయాలతో పాటు భవన నిర్మాణ రంగం, వ్యవసాయం, రైతు బజార్లు వంటి అసంఘటిత రంగంలో పనిచేసే మహిళల భద్రతకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో స్థానిక ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేస్తారు. కమిటీ సభ్యులు అక్కడి మహిళలతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు లైంగిక వేధింపుల నిరోధక చట్టం, మహిళా హక్కులపై అవగాహన కల్పించాలి.

ఫిర్యాదులు ఇలా..

లైంగిక వేధింపులకు గురైతే బాధిత మహిళ ఆన్‌లైన్‌లో shi-box.nic.inపోర్టల్ ఫిర్యాదు చేయాలి. కమిటీ సభ్యులు అంతర్గతంగా విచారణ చేపడతారు. నివేదికను జిల్లా అధికారి (కలెక్టర్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి)కి పంపిస్తారు. నేరం రుజువైతే నేర తీవ్రతను బట్టి నిందితుడిపై అరవై రోజుల్లో చర్యలు తీసుకుంటారు. బాధిత మహిళలు ఉచితంగా న్యాయ సహాయం పొందడానికి సఖి కేంద్రాలు అండగా ఉంటాయి.

కమిటీల ఏర్పాటు ప్రక్రియ త్వరలో పూర్తిచేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నిచోట్ల అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లా, మండల స్థాయిల్లో ఈ ప్రక్రియను త్వరలోనే పూర్తిచేస్తాం.

– దయానందరాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

మొక్కలను రక్షించుకుంటేనే మానవ మనుగడ



చెట్టుకు రాఖీ కడుతున్న పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు

కోదాడ: మొక్కలను రక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ప్రతిఒక్కరూ వృక్షాబంధన్ కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలకు రాఖీలను కట్టి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు అన్నారు. రాఖీ పర్వదినాన్ని పరస్కరించుకొని కోదాడ పట్టణ పరిధిలోని అశోక్ నగర్ వద్ద ఆయన ఆధ్వర్యంలో శనివారం మొక్కలకు రాఖీలు కట్టారు. ప్రతి ఇంట్లో చిన్నా పెద్దా మొక్కల ప్రాధాన్యతను గుర్తించి ఈ కార్యక్రమాన్ని తమ ఇంటి నుంచే ప్రారంభించాలని, ముందు ఇంట్లో మొక్కలను, ఆ తర్వాత ఇంటి ముందు మొక్కలను రక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ బషీరుద్దీన్, ఆవుల శివప్రసాద్, షేక్ షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న సోదరుడి వద్దకు వెళ్లి..

- రాఖీ కట్టిన సోదరి



సూర్యాపేట జిల్లా కేంద్రంలో కానిస్టేబుల్ శ్రీనుకు రాఖీ కడుతున్న అతడి సోదరి సుజాత

అర్వపల్లి: కానిస్టేబుల్‌గా విధుల్లో ఉన్న సోదరుడి వద్దకే వెళ్లి రాఖీ కట్టి తన ప్రేమను చాటుకుంది ఓ సోదరి. వివరాలు.. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన రమావత్ సుధాకర్ భార్య సుజాత శనివారం తన సోదరుడికి రాఖీ కట్టడానికి సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్లింది. ఆమె సోదరుడు లునావత్ శ్రీను సూర్యాపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శనివారం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఉండగా సుజాత నేరుగా అక్కడికి వెళ్లి పొట్టి శ్రీరాములు విగ్రహం పక్కనే సోదరుడు శ్రీనుకు రాఖీ కట్టింది.

కుటుంబ కలహాలతో బలవన్మరణం

కేతేపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కేతేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన దుబ్బాక రాంరెడ్డి (47) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. అప్పు తీర్చకపోగా మద్యం సేవిస్తూ కొంతకాలంగా పనికి వెళ్లడం లేదు. ఈ విషయమై భార్య స్వాతితో తరుచూ గొడవ పడుతుండేవాడు. శుక్రవారం భార్యతో గొడవ పడి మనస్తాపం చెందిన రాంరెడ్డి ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటంబ సభ్యులు గమనించి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

• సోదరా నీవే రక్ష

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సాక్షి నిర్వహించిన 'సెల్ఫీ విత్ రాఖీ' ఆహ్వానానికి విశేష స్పందన లభించింది. మహిళలు, యువతులు, బాలికలు తమ సోదరులకు రాఖీ కట్టి సెల్ఫీ తీసుకుని పంపించారు. అందులో కొన్ని..



రక్షిత, ప్రణయ్, పాలకీడు | గురులక్ష్మి, నర్సింహులగూడెం | భూపతి రేణు, సూర్యాపేట | సులోచన, మానస, సూర్యాపేట | లక్కీ, సూర్యాపేట | హారిణి, సూర్యాపేట | ప్రవస్తి, స్వాతిక, సూర్యాపేట | రక్షిత, సూర్యాపేట



సహస్ర, సూర్యాపేట | ఆద్యశ్రీ, ఇస్తాళాపురం | సంధ్య, బాలెంల | హర్షిత, దోరకుంట | నాగలక్ష్మి, బక్కమంతులగూడెం | కౌసల్య, చిలుకూరు | రోషిణి, కోదాడ | కౌసల్య, కోదాడ



నవ్య, సూర్యాపేట | కృతిక, సూర్యాపేట | సునంద, సూర్యాపేట | ప్రవీణ, గాయత్రి, సూర్యాపేట | భవాని, సూర్యాపేట | నీరజ, తిరుమలగిరి | రంగమ్మ, సూర్యాపేట | పరిమళ, బరఖత్‌గూడెం



మనస్విత, అర్వపల్లి | వసంత, సూర్యాపేట | యస్విత, దుబ్బతండా, పెన్‌పహాడ్ | వేదన్షి, నూతనకల్ | హర్షిత, సూర్యాపేట | హేమలత, సూర్యాపేట | మమత, ముక్కుదుదేవులపల్లి



ధనలక్ష్మి, సూర్యాపేట | రాధిక, కోదాడ | శాంత, అక్కమ్మ, చిలుకూరు | పూజిత, జెర్రిపోతులగూడెం | కావ్య, జెర్రిపోతులగూడెం | రేణుక, నూతనకల్ | నేహ, సూర్యాపేట | శ్రీదేవి, కొక్కిరేణి, మునగాల



వెంకటమ్మ, మీనా కుమారి, హుజూర్‌నగర్ | అంజలి, వెలిశాల | సుప్రియ, గణపవరం | హర్షిత, అనంతారం | జరీనా, చిలుకూరు | సోఫియా, చిలుకూరు | సింధు, చిలుకూరు | కార్తీకలక్ష్మి, కోదాడ

బుద్ధవనం సందర్శనకు అమెరికన్ల ఆసక్తి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, నాగార్జునకొండను సందర్శించటానికి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో గల మహాయాన బుద్ధ విహార ప్రధానాచార్యుడు ఆసక్తి కనబర్చారని బౌద్ధ పరిశోధకుడు, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. బౌద్ధాలయాల సందర్శనలో భాగంగా శనివారం ఆయన న్యూయార్క్ కెనాల్ వీధిలోని మహాయాన బౌద్ధాలయాన్ని సందర్శించి బుద్ధవనం, నాగార్జునకొండను సందర్శించమని ప్రధానాచార్యుడిని ఆహ్వానించినట్లు తెలిపారు. బుద్ధవనంలో ఆచార్య నాగార్జునుడి రచనలపై ఒక పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలని, కృష్ణా నది తీరంలో విలసిల్లిన ప్రముఖ బౌద్ధ స్థావరాల వివరాలను తెలుసుకోవడానికి తగిన సమాచారం అందజేయమని బుద్ధ విహార ప్రధానాచార్యుడు కోరారని ఆయన పేర్కొన్నారు. బుద్ధవనం అధికారులను కలిసి ఈ విషయంపై చర్చించి కేవలం దక్షిణాసియా దేశాల నుంచే కాక యూరోప్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల బౌద్ధ పర్యాటకులను ఆకర్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. ఆయన వెంట ప్రముఖ ఆహార శాస్త్రవేత్త, న్యూయార్క్ తెలుగు లిటరరీ అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధి, కథా రచయిత డాక్టర్ కలశపూడి శ్రీనివాసరావు ఉన్నారు.



న్యూయార్క్ కెనాల్స్ వీధిలోని బౌద్ధాలయంలో శివనాగిరెడ్డి (ఎడమ)

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 10కిలోల గంజాయి స్వాధీనం

సూర్యాపేటటౌన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగారం పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ శనివారం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పెద్దకొడగల్ మండలం పోరాటం గ్రామానికి చెందిన పడవాల్ సుధార్, కాటేపల్లికి చెందిన భర్ధవాల్ శంకర్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ఈ నెల 3న ఏపీలోని విశాఖపట్నం, పాడేరుకు వెళ్లి వారికి పరిచయం ఉన్న మహేష్ అనే వ్యక్తి వద్ద 10కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వారు 7వ తేదీన బయల్దేరారు. శుక్రవారం మధ్యాహ్నం సూర్యాపేట మీదుగా తొర్రూర్ వెళ్లేందుకు నాగారం ఎక్స్ రోడ్డు వద్ద బస్సు దిగగా.. నమ్మదగిన సమాచారం మేరకు నాగారం పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి 10కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

వాగులో కొట్టుకుపోయిన కారు బయటకు..



క్రేన్‌తో వాగు నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం

చౌటుప్పల్ రూరల్: భారీ వర్షాలకు శుక్రవారం చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామ పరిధిలోని ఈదుల వాగులో కొట్టుకుపోయిన కారు ఓ చెట్టుకు తాకి ఆగింది. నీటి ఉధృతి తగ్గడంతో శనివారం స్థానికులతో పాటు కారుకు సంబంధించిన వ్యక్తులు కారును వాగు నుంచి బయటకు తీసేందుకు యత్నించగా.. ఇసుక మేటలు వేయడంతో సాధ్యం కాలేదు. దీంతో చౌటుప్పల్ నుంచి క్రేన్‌ను పిలిపించి కారును బయటకు తీశారు. కారు బయటికి తీస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

బోనాల పండుగ.. ఉపాధి మెండుగ

- గ్రామాల్లో శ్రావణమాసం బోనాల సందడి
- కుండలు, నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లు, బ్యాండ్, డప్పులు, ఎల్‌ఈడీ లైటింగ్‌కు ఫుల్ గిరాకీ

సండే స్పెషల్

రామగిరి(నల్లగొండ), సూర్యాపేట అర్బన్: ఉమ్మడి జిల్లాలో శ్రావణ మాసం బోనాల సందడి నెలకొంది. హైదరాబాద్‌లో ఆషాఢమాసంలో బోనాలు నిర్వహిస్తే, పల్లెల్లో మాత్రం శ్రావణమాసంలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పండుగకు ఇంటికొచ్చే బంధువులు, ఆడపడుచుల రాకతో బోనాల వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. బోనాల పండుగ సామాజికంగా, ఆర్థికంగా చాలామందికి ఉపాధి కల్పిస్తోంది.



మట్టి కుండలకు గిరాకీ

బోనాల పండుగలో భాగంగా అమ్మవార్లకు ప్రతి కుటుంబం నుంచి బోనం సమర్పిస్తారు. కుమ్మరి వృత్తివారు వివిధ ఆకారాల్లో బోనం కుండలతో పాటు దానిపై దీపం పెట్టే మూతను ఒక సెట్‌లాగా తయారు చేసి అమ్ముతున్నారు. బోనాల సీజన్‌లో కుండలకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో నెల రోజుల ముందు నుంచే కుండల తయారీ ప్రక్రియ ప్రారంభించారు. ఆర్డర్లకు అనుగుణంగా కుండలు, చిన్న గురిగిలను తయారు చేసి ఇస్తున్నారు.



నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లు అ'ధర'హో..





సాధారణ రోజుల కంటే శ్రావణమాసం బోనాల సమయంలో నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. భక్తులు అమ్మవారికి నాటుకోళ్లు, గొరెర పొట్టేళ్లను బలిస్తారు. సాధారణంగా నాటుకోడి కిలో రూ.500 ఉంటుంది. ప్రస్తుతం డిమాండ్ ఎక్కుగా ఉండడంతో రూ.600 నుంచి 700 వరకు ధర పలుకుతోంది.

కుల వృత్తులకు కలిసొచ్చే పండుగ..



బోనాల ఊరేగింపులో బ్యాండ్, డప్పు చప్పుళ్ల, డీజేలు ఉపయోగిస్తుతండడంతో వారికి ఉపాధి లభిస్తోంది. మాంసం విక్రయించే వారు, చాకలి, మంగలి కుల వృత్తుల వారు, ఎల్‌ఈడీ లైటింగ్, నైవేద్యం తయారీకి కిరాణా సామాను కొనుగోలు చేస్తుండడంతో ఆర్థికంగా లబ్ధి చేకూరుతోంది.

వ్యాపారులు, ప్రభుత్వానికి లబ్ధి

బోనంతో పాటు అమ్మవారిని అంకరణకు పూలు, మామిడి ఆకులు అవసర ఉండడంతో పూల మార్కెట్లలో వ్యాపారం ఊపందుకుంది. కొబ్బరికాయలు విక్రయించే వారికి కూడా గిరాకీ పెరిగింది. బస్సుల్లో ప్రయాణించే వారితో ఆర్టీసీకి, బోనాల సందర్భంగా మద్యానికి డిమాండ్ పెరిగి ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.



గిరాకీ బాగుంది



శ్రావణమాసం బోనాల పండుగ సందర్భంగా కుండల గిరాకీ బాగానే ఉంది. సూర్యాపేట పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు దగ్గర కుండలు పెట్టి విక్రయిస్తున్నాను. వివిధ సైజులను బట్టి రూ.150 నుంచి 300 దాకా అమ్ముతున్నాం.

– నిమ్మనకొట్టి పూలమ్మ, కుండల వ్యాపారి, సూర్యాపేట

రకరకాల డిజైన్లతో తయారు చేస్తున్నాం



వివిధ రకాలుగా బోనం కుండలను డిజైన్ చేసి అమ్ముతున్నాం. బోనం కుండ మూత దానిమీద పెట్టే గురిగి, వెయ్యి గండ్ల బోనం, సాదా బోనం కుండ, అలంకరణ చేసిన బోనం కుండలను విక్రయిస్తున్నాం. వెరైటీని బట్టి ధర ఉంటుంది.

– మురళి, కుమ్మరి బజార్, సూర్యాపేట

ముందుగానే ఆర్డర్లు ఇస్తారు



బోనాల పండుగ కోసం మట్టి కుండలు, చిన్న గురుగులు, దీపం మూతలను ముందుగానే ఆర్డర్లు ఇస్తారు. దానికి అనుగుణంగా తయారుచేసి పంపుతాం. ఇంటి వద్ద కూడా విక్రయిస్తాం. నెల రోజుల పాటు ఆర్థికంగా చేదోడుగా ఉంటుంది.

– బొడ్డుపల్లి మల్లయ్య, కుండల తయారీదారుడు, నల్లగొండ

ప్రభుత్వాస్పత్రిలో పాము

భువనగిరి: భువనగిరి జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం రాత్రి పాము ప్రత్యక్షమైంది. రోగులు గమనించి కేకలు వేయడంతో స్థానికులు పామును చంపేశారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం వేస్తుండడం, విద్యుత్ దీపాలు సరిగా లేకపోవడంతో పాములు వస్తున్నాయని రోగులు అంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణను శుభ్రంగా ఉంచడంతో పాటు రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు వేయాలని రోగులు, బంధువులు కోరుతున్నారు.